సాక్షి సిద్దిపేట
మంగళవారం । 8 । జూలై । 2025



బరువెంత..? ఎత్తెంత..?
అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు ఈ నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.
వివరాలు 8లో ▸



భద్రత.. పునరావాసం
మున్సిపాలిటీల్లో నమస్తే పథకం కింద గుర్తించిన కార్మికులను యాప్‌లో నమోదు చేస్తున్నారు.
వివరాలు 8లో ▸



సంపు.. గొంతెప్పుడు తడుపు?
గిరిజన తండాల్లో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 'భగీరథ'కలగా మిగిలింది.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



బీఎల్‌ఓలతో అదనపు కలెక్టర్, తహసీల్దార్

వర్గల్(గజ్వేల్): తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా ఓటరు జాబితా తయారు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. సోమవారం వర్గల్ మండలం గౌరారం రైతువేదికలో తహసీల్దార్ బాల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి బూత్ లెవెల్ ఆఫీసర్ల(బీఎల్‌ఓ) శిక్షణ శిబిరాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ చంద్రకళ సందర్శించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదుచేయాలన్నారు. మృతుల తొలగింపు, సవరణ, కొత్త ఓటర్లు ఎలా నమోదు చేయాలి తదితర అంశాలను, వినియోగించాల్సిన ఫారాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రేనర్ రామకృష్ణారెడ్డి, ఆర్‌ఐ రాజు, సహాయకుడు ఎస్ శంకర్, వెంకటేష్‌గౌడ్, వివిధ గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అంజయ్య గౌడ్‌కు పురస్కారం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతి సాహితీ సంస్థ కోరుట్ల ఆధ్వర్యంలో అందిస్తున్న అందె వెంకటరాజం స్మారక పురస్కారానికి సిద్దిపేటకు చెందిన అవధాని బండకాడి అంజయ్య గౌడ్ ఎంపికైనట్లు కవి ఉండ్రాళ్ళ రాజేశం తెలిపారు. కోరుట్లలోని సినారె కళాభవనంలో ఈ నెల 12న అంజయ్య గౌడ్ పురస్కారం అందుకుంటారన్నారు. పద్య సాహిత్యంలో విశేష సేవచేస్తున్న అంజయ్యగౌడ్ ఎంపిక కావడంపై పలువురు కవులు అభినందించారు.

జీఓ రద్దు చేయాల్సిందే



జీఓ ప్రతులను దహనం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సిద్దిపేటఅర్బన్: పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచుతూ తెచ్చిన జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేటలో కార్మిక సంఘాల నాయకులు జీఓ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 రకాల కార్మిక చట్టాలను తిరిగి తీసుకురావడానికి కార్మిక సంఘాలు ఈనెల 9న సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు గోపాలస్వామి, లక్ష్మణ్, నర్సింహులు, మల్లేశం, రవికుమార్, సంపత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుండవెళ్లిలో శ్రమదానం



జేసీబీతో ముళ్లచెట్లను తొలగిస్తూ..

దుబ్బాక: మండలంలోని పెద్దగుండవెళ్లిలో సోమవారం రేణుకమాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు శ్రమదానం చేశారు. ఆలయానికి వచ్చే ప్రధాన రహదారికి రెండువైపులా పెరిగిన చెట్లను తొలగించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేశ్, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు యాదగిరి, బుచ్చిరెడ్డి, మాల్లారెడ్డి, కిషన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినికి డాక్టరేట్



అరుణను అభినందిస్తున్న స్థానికులు

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని భల్లు నాయక్ తండాకు చెందిన అజ్మీర అరుణ వృక్ష శాస్త్రం (బాటనీ)లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. దీంతో గ్రామస్తులు ఆమెను అభినందించారు. ఎమ్మెస్సీ చదివిన అరుణ పీహెచ్‌డీ పూర్తి చేశారు. సోమవారం హన్మకొండ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

గాలిలో తుంగ.. నిత్యం బెంగ

దుబ్బాక అంతటా వ్యాప్తి
- వాహనదారులకూ తప్పనితిప్పలు
- సమస్య తీర్చాలని ప్రజల వేడుకోలు



దుబ్బాక చెరువు కట్ట సమీపంలో ఏపుగా పెరిగిన తుంగ

దుబ్బాకటౌన్: 'ఇందు గలదు అందులేదని సందేహం వలదు.. ఎందెందువెదికినా అందందే గలదు'.. ఇదేమిటని అనుకుంటున్నారా.. అదే.. తుంగండి. ఇప్పుడు దుబ్బాక అంతటా వ్యాపించింది. ఇళ్లల్లో, హోటళ్లలో, రోడ్లపై, ఎక్కడపడితే అక్కడా గాల్లో తేలియాడుతూ.. ఇటు ప్రజలను అటు వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దుబ్బాక పెద్ద చెరువు కట్ట సమీపంలో మురికి నీరు ప్రవహించే ప్రాంతంలో పిచ్చిమొక్కలు (తుంగ) ఏపుగా పెరిగి ఎండాకాలంలో ఎండిపోయాయి. ప్రస్తుతం వీస్తున్న ఉధృతమైన గాలికి తెలుపురంగులో తుంగంతా నలుమూలలా వ్యాపిస్తోంది.

ఆహారపదార్థాలపై..
తుంగ విపరీతంగా గాల్లో తేలియాడటమేకాకుండా తినుబండారాలపై వాలుతోంది. దీంతో హోటళ్ల, మిర్చి పాయింట్, పానీపూరి, మొక్కజొన్న కంకులు, తదితర తినుబండారాలు విక్రయించే వీధి వ్యాపారులు గిరాకీలు కావడం లేదంటూ వాపోతున్నారు. తుంగ ఆహారపదార్థాలపై పేరుకుపోవడంతో ఎవరూ తినడానికి ఇష్టపడటం లేదంటూ వీధి వ్యాపారులు చెబుతున్నారు.

వాహనదారులపై ప్రభావం
ద్విచక్ర వాహనదారుల కళ్లలో, ముక్కులోకి అకస్మాతుగా తుంగ వెళ్లడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముక్కులోకి వెళ్లడం వల్ల జలుబు, జ్వరం వచ్చి అనారోగ్యానికి గురవుతున్నామని వారు వాపోతున్నారు.

> **చర్యలు చేపట్టాలి**
> గాల్లో తుంగతో ఇబ్బందులు అన్నీఇన్నీకావు. దుకాణంలో కూర్చొని పాలు కూడా అమ్మలేక పోతున్నా. తుంగ కళ్లలో, ముక్కులోకి వెళ్లి ఇటీవల అనారోగ్యానికి గురయ్యా. తుంగతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
> – నటరాజ్, పాలవ్యాపారి, దుబ్బాక
>
> **సమస్య పరిష్కరిస్తాం**
> తుంగ బహిరంగ ప్రదేశాల్లో పెరిగింది వాస్తవమే. తుంగ పెరిగిన ప్లాటు యజమానులకు నోటీసులు పంపిస్తాం. తుంగ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
> –రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

హడలెత్తిస్తున్న కలెక్టర్

విస్తృత పర్యటనలు.. ఆకస్మిక తనిఖీలు
- అ'టెన్షన్'లో అధికారులు, సిబ్బంది
- జిల్లా పాలనలో తనదైన మార్క్

కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలతో అధికారులు, సిబ్బంది హడలిపోతున్నారు. డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు.. గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ కార్యాలయానికి వస్తారోనని అధికారులు, సిబ్బంది అ'టెన్షన్'లో ఉంటున్నారు. జిల్లా పాలనలో కలెక్టర్ తనదైన మార్క్ చూపిస్తున్నారు.
– సాక్షి, సిద్దిపేట



హుస్నాబాద్‌లోని కస్తూర్బాలో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

జిల్లా కలెక్టర్‌గా హైమావతి ఈ ఏడాది జూన్ 14న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పర్యటనలు, వివిధ శాఖలపై రివ్యూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అమలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో నలుగురు మంత్రులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పలు ప్రారంభోత్సవాల సందర్భంగా కలెక్టర్ మంత్రోచ్చరణలు చేశారు. దీంతో మంత్రులందరూ కలెక్టర్‌ను అభినందించారు.

అధికారులకు ఆదేశాలు
జిల్లాలో ఉన్న గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్లను ఈ నెల 4 నుంచి కలెక్టర్ ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వంట గదులు, సరుకులను పరిశీలిస్తున్నారు. వండిన వంటలను రుచి చూస్తున్నారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్నారు. విద్యార్థుల మాటమంతీలో సమస్యలు, డైట్ మెనూ వంటి విషయాలు తెలుసుకుంటున్నారు. అలాగే చదువు, భోజనం ఎలా అందిస్తున్నారని అడుగుతున్నారు. విద్యార్థులు తీసుకవచ్చిన సమస్యలపై వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. స్టోర్‌ను పరిశీలిస్తూ నాణ్యమైన ఆహారపదర్థాలు మాత్రమే అందించాలని, కాలం చెల్లిన పదార్థాలను వాడకూడదని సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. స్టాక్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్నారు. తాను ప్రభుత్వ హాస్టళ్లలోనే ఉండి చదువుకుని ఈ స్థాయికి వచ్చానని వివరిస్తున్నారు. మీరు సైతం పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుతున్నారు. 'మొదటి సారి తనిఖీ కనుక.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మరో సారి ఇలానే పునరావృతమైతే చర్యలు తప్పవ'ని అధికారులు, సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. కొన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ ఉన్నప్పటికీ అధికారులు ఉదయం ఫింగర్ ప్రింట్ వేసి.. మళ్లీ సాయంత్రం వచ్చి మరో మారు థంబ్ వేసి వెళ్లుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలానే కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేస్తేనే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, సక్రమంగా విధులు నిర్వర్తిస్తారని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



కొండపాకలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాణ్యమైన భోజనం అందించాలి

హుస్నాబాద్: పాఠశాలల్లో, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హైమావతి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి కలెక్టర్ తనిఖీచేశారు. స్టాక్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డైట్ మెనూ తప్పని సరిగా అమలు చేయాలన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రతి వంటా రుచికరంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల చదువు, భోజనం విషయంలో రాజీ పడవద్దని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదవాలని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇప్పటి నుంచే కష్టపడాలన్నారు. వారి వెంట ఎంఈఓ బండారి మనీల ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్లు

అర్జీలను సత్వరం పరిష్కరించండి

- కలెక్టర్ హైమావతి
- ప్రజావాణికి 152 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో ప్రజలు అందించిన అర్జీలను సత్వర పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అందిస్తున్న అర్జీలను వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి 152 అర్జీలు వచ్చాయి. అంతకుముందు అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో మండల ప్రత్యేక అధికారులు శానిటేషన్, ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి, వన మహోత్సవం సహ అన్ని కార్యక్రమాల ప్రగతిని పర్యవేక్షించాలన్నారు. ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీజిల్‌తో వచ్చిన బాధితుడు..



డీజిల్ కవర్‌ను పట్టుకున్న పోలీసులు

అక్కన్నపేట మండలం గోవర్ధనగిరికి చెందిన ఎల్లారెడ్డి భూ బాధితుడు తన సమస్య పరిష్కారం కావడం లేదంటూ ప్రజావాణి కార్యక్రమానికి డీజిల్ కవర్‌తో వచ్చారు. పోలీసులు అతడిని తనిఖీ చేయడంతో డీజిల్‌తో ఉన్న కవర్‌ను గమనించారు. దీంతో ఆయనను లోపలికి అనుమతించలేదు. గ్రామంలోని 266, 267 సర్వే నంబర్లలో తన పేరు మీద ఉన్న 23 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరగా అధికారులు తిప్పించుకుంటున్నారే తప్ప పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేదిలేక డీజిల్‌తో కలెక్టరేట్‌కు వచ్చినట్లు బాధితుడు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఖాళీ బిందెలతో కలెక్టరేట్‌కు..



ఖాళీ బిందెలతో మొండిచింత కాలనీ మహిళలు

చేర్యాల మండల కేంద్రానికి చెందిన మొండిచింత కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బోరు మోటారు పాడై రోజులు గడుస్తున్నప్పటికీ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. దీంతో నీటి ఎద్దడి తీవ్ర మైందన్నారు. తమ కాలనీలోని పాఠశాల విద్యార్థులు సైతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే సేవలు

ఉమ్మడి జిల్లా డిప్యూటీ రవాణా శాఖ అధికారి వెంకటరమణ



వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న లక్ష్మణ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే వాహనదారులకు నేరుగా సేవలు అందించాలని ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ రవాణా శాఖ అధికారి వెంకటరమణ అధికారులకు సూచించారు. సోమవారం సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయాన్ని వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. వాహనదారులు, ప్రజలు రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలను పొందాలన్నారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ కింద స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్నామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో ఎక్కువ మంది ప్రయాణిస్తే వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.



చేర్యాల ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న బాధితులు

కూల్చివేతలు ఆపండి

చేర్యాలలో బాధితుల ఆందోళన

చేర్యాల(సిద్దిపేట): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టణ కేంద్రంలో చేపట్టిన నిర్మాణాల కూల్చివేత ఆపాలని పలువురు బాధితులు సోమవారం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నవీన్ అక్కడకు వచ్చి ఆందోళన విరమింపజేసిన వారిని స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ గతంలోనే డ్రైనేజీ నిర్మాణం పేరుతో కొంత భాగం కూల్చివేశారని, మళ్లీ ఇప్పుడు రహదారి విస్తరణలో భాగంగా కూల్చి వేయడం సరికాదన్నారు. అనంతరం వారందరూ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి టౌన్ ప్లానింగ్ అధికారి కల్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే కూల్చివేతలను ఆపాలని విన్నవించారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు సంపత్, బాలనారాయణ, కృష్ణమూర్తి, రమేష్, శ్రీనివాస్, చంద్రమౌళి, అంజయ్య, ప్రసాద్, మహేందర్, శంకర్, మురళి పాల్గొన్నారు. వీరికి సీపీఐ నాయకులు అశోక్, భాస్కర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు మద్దతు తెలిపారు.

ఆ ఎనిమిది మంది
ఏమయ్యారో?

- నేటికీ ఆచూకీ లభించని కార్మికుల జాడ
- సిగాచీ పరిశ్రమలో గల్లంతైన వారి కుటుంబికుల్లో ఆందోళన
- రాత్రింబవళ్లు కొనసాగుతున్న తవ్వకాలు



'సిగాచీ'లో పేలుడు జరిగిన ప్రాంతం



ఐలా భవన్ హెల్ప్ డెస్క్ వద్ద గల్లంతైన కార్మిక కుటుంబీకుల నిరీక్షణ

ఒకటి కాదు రెండు కాదు.. ఏడు రోజులు అవుతున్నా వారి ఆప్తుల జాడ లభించడం లేదు. వారేమయ్యారో అంతు చిక్కడం లేదు. తమను ఆదుకోవాల్సిన పెద్ద దిక్కు జాడ తెలియక పోవడంతో మనోవేదనకు లోనవుతున్నారు. పరిశ్రమలో పని చేసేందుకు వచ్చిన వారు ఇలా ఆకస్మికంగా దూరం కావడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆఖరి చూపునకు కూడా నోచుకోకుండా పోతున్నామని కుమిలిపోతున్నారు. వారం రోజులుగా సిగాచీ పరిశ్రమ వద్ద పడిగాపులు కాస్తున్నారు.
– పటాన్‌చెరు

పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన విస్ఫోటనంలో గల్లంతైన కార్మికుల కోసం వారి కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. గత నెల 30న పరిశ్రమలో పేలుడు జరిగిన సమయంలో 143 మంది పనిచేస్తున్నారు. ఆ సమయంలో పనిచేస్తున్న వారిలో గాయాలపాలైన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను వారి బంధువులకు అప్పజెప్పారు. ఇంకా ఎనిమిది మంది కార్మికుల జాడ మాత్రం నేటికీ దొరకలేదు. వారేమయ్యారో అంతు చిక్కడం లేదు. వారి కుటుంబీకులు మాత్రం పరిశ్రమ వద్ద గత వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. పరిశ్రమలో పని చేసేందుకు వచ్చిన వారు ఇలా ఆకస్మికంగా దూరం కావడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మరోవైపు అధికారులు రాత్రింబవళ్లు సిగాచీ పరిశ్రమలో గల్లంతైన వారి భౌతికకాయాల కోసం వెతుకులాట ముమ్మరం చేశారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో హైడ్రా, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు మట్టి దిబ్బల కింద, బూడిద మట్టిలో అణువణువు వెతుకుతున్నారు. అయితే అక్కడ పని చేస్తున్న వారిపై ఉన్నతాధికారులు, బాధితుల ఒత్తిడి రోజు రోజుకు పెరుగుతుంది. రెండు రోజుల క్రితం వరకు ఆ శిథిలాల్లో అక్కడక్కడ మాడిపోయిన మాంసం ముద్దలు లభించాయి. కానీ ప్రస్తుతం అలాంటి మానవ అవశేషాలు ఏవీ లభించడం లేదు. వెతుకులాట ప్రక్రియ దాదాపు తుదిదశకు చేరిందనే చెప్పాలి. పరిశ్రమలో పేలుడు జరిగిన సమయంలో దాదాపు 700 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రత ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అంత వేడికి శరీరాలు పూర్తిగా మాంసం ముద్దలుగా మారి బూడిదలో కానరాకుండా కలిసిపోయి ఉంటాయని భావిస్తున్నారు.

పాలు అమ్ముతానని చెప్పి..

బండ్లగూడలో స్థిరపడిన ఓ కుటుంబానికి చెందిన ఆస్టిన్ పాల ప్యాకెట్లు వేసే పని చేస్తానని ఇంట్లో వారికి చెప్పి ఈ పరిశ్రమలో చేరాడట. ఆ పరిశ్రమలో ప్రమాదం జరిగిన రోజు కంటే రెండు రోజుల ముందే అక్కడ డ్యూటీలో చేరాడు. మూడో రోజే ప్రమాదం జరిగింది. నేటికీ ఆ యువకుడి ఆచూకీ లభించడం లేదు. ఆస్టిన్ కుటుంబ సభ్యులు కనపడిన ప్రతి అధికారి కాళ్లపై పడుతున్నారు. కనీసం అతడి మృతదేహం అయినా ఇప్పించాలని రోధిస్తున్నారు. ఆస్టిన్ తోడబుట్టిన చెల్లెళ్లు, ఇతర కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆస్టిన్‌తో పాటు రాహుల్ కుమార్ శర్మ, వెంకటేష్, సిల్వరీ రవి, శివ్‌జీ కుమార్, విజయ్ కుమార్ నిషద్, ఇర్ఫాన్ అన్సారీల ఆచూకీ కోసం వారి కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

సింగూరు జలాలను విడుదల చేయాలి

బీకేఎస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: సింగూరు జలాలను వెంటనే విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డిలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట ఖర్చులు పెరగడంతో చెరకు పంటకు టన్నుకు రూ.500 చెల్లించాలని, జొన్నలు కొనుగోలు డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను తీర్చాలన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి సదానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

సీఐ విద్యాసాగర్‌కు సేవా పతకం


సీఐ విద్యాసాగర్‌ను అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ సీఐ విద్యాసాగర్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2025 అతిఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైనట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీఐని సోమవారం ఆమె అభినందించారు. ఎలాంటి రిమార్క్ లేకుండా పోలీసు శాఖలో 25 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న విద్యాసాగర్ ఈ పథకావడం గర్వకారణమన్నారు. త్వరలోనే ఈ పతకం అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచే అధికారులు, సిబ్బందిని గుర్తించి అవార్డులు, రివార్డులు, సేవా పతకాలు ఇస్తామన్నారు.

తండ్రి మందలించారని..

తొమ్మిదో తరగతి విద్యార్థి అదృశ్యం


అభిరాం

హత్నూర(సంగారెడ్డి): తండ్రి మందలించడంతో తొమ్మిదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మంగాపూర్‌కు చెందిన గడ్డమీది వీరేశం, నిర్మల దంపతుల పెద్ద కుమారుడు అభిరాం దౌల్తాబాద్ లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ఆలస్యంగా రావడంతో తండ్రి వీరేశం మందలించాడు. సోమవారం తెల్లవారుజామున అభిరాం ఇంట్లో నుంచి వెళ్లిపోయి సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 83309 07363, 96528 87845, 97014 68493 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కుటుంబీకులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో జింక హతం



రామాయంపేట(మెదక్): దారి తప్పి అటవీప్రాంతం నుంచి గ్రామంలోకి వచ్చిన చుక్కల జింకను సోమవారం మండలంలోని లక్ష్మాపూర్ వద్ద కుక్కలు హతమార్చాయి. ఈ విషయమై గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి ఖుద్బుద్దీన్ సంఘటనా స్థలిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పశువైద్యుడు పోస్టుమార్టం నిర్వహించారు.

బరువెంత..? ఎత్తెంత..?

చిన్నారులపై ప్రత్యేక దృష్టి

- అంగన్‌వాడీల్లో స్పెషల్ డ్రైవ్
- సంపూర్ణ ఆరోగ్యం దిశగా కృషి
- ఒక్కో ప్రాజెక్టులో ఏక కాలంలో జిల్లాలోని సూపర్‌వైజర్లందరూ తనిఖీలు

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేది పేద పిల్లలు కావడంతో వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ పోషకాహార లోపాలను అధిగమించేలా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లాలో ఈ నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కూడా అంగన్‌వాడీల బలోపేతం, పిల్లల ఆరోగ్యం పట్ల సంపూర్ణ శ్రద్ధ కనబరుస్తుండడంతో జిల్లా అధికారులు ఒక అడుగు ముందుకు వేసి.. జిల్లా మొత్తం స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవల అంగన్‌వాడీల పనితీరుపై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు మార్లు సమీక్షలు నిర్వహించారు. పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. చిన్నారుల్లో పోషకాహారాన్ని మెరుగుపర్చడం, అవసరమైతే స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవడం గురించి సూచనలు చేశారు. పోషకాహార లోపం చిన్నారుల్లో తగ్గించి ప్రోగ్రెస్ రిపోర్ట్ విధానం అమలు చేయాలని సూచించారు.

3,250 మంది చిన్నారుల్లో పోషకాహార లోపం

జిల్లాలో నారాయణఖేడ్, జోగిపేట, సదాశివపేట్, జహీరాబాద్, పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో 0- 6 ఏళ్లలోపు చిన్నారులు 1,02,755 మంది ఉన్నారు. వీరిలో ఎస్ఏఎం (తీవ్ర పోషకాహారలోపం ఉన్న పిల్లలు) 627మంది ఉండగా ఎంఏఎం (తక్కువ పోషకాహారలోపం పిల్లలు) 2,623 మంది ఉన్నారు. అందరు చిన్నారులకు పోషణలోపం సమస్యలు దూరం చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతీనెల నమోదు

ప్రతీనెల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువు, ఎత్తులను అంగన్‌వాడీ టీచర్లు నమోదు చేస్తారు. ఈ వివరాలను ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీని ఆధారంగా పిల్లల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని అధికారులు చర్యలు తీసుకుంటారు. తక్కువ తీవ్ర లోప పోషణ, తీవ్ర లోప పోషణ ఉన్న చిన్నారులకు గుర్తించి వారికి బాలామృతం ప్లస్ అందివ్వడం, ఒక గుడ్డుకు బదులు రెండు గుడ్లు అందిస్తారు. మరీ అనారోగ్య సమస్యగా ఉంటే చిన్నారి తల్లిదండ్రులతో కలిసి అంగన్‌వాడీ టీచర్ సమీప పీహెచ్‌సీలో చికిత్సలు చేయిస్తారు.


చిన్నారులను తూకం వేస్తున్న సూపర్‌వైజర్


చిన్నారి ఎత్తు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

తక్కువ బరువుతో నష్టం

చిన్నారుల్లో వయస్సుకు తగ్గ బరువు, ఎదుగుదల తగ్గుదలతో తీవ్ర నష్టాలు వస్తాయి. పిల్లలకు పోషకాహారం అందుబాటులో లేకపోవడం, తిన్న ఆహారం జీర్ణం చేసుకొనే సామర్థ్యం దెబ్బతినడం వారి పెరుగుదలను దెబ్బతీస్తూ తరచూ అనారోగ్య సమస్యలు వస్తాయి. రోగ నిరోధక శక్తి తగ్గి త్వరగా ఇన్ఫెక్షన్ల బారిన పడుతారు. మెదడు అభివృద్ధి, జ్ఞానాత్మక నైపుణ్యాలపై ప్రభావం పడుతోంది. ఇది అభ్యసన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అంగన్‌వాడీల తనిఖీలు

కాగా కేంద్రాల్లో చిన్నారుల బరువు, ఎత్తు తీయడం, వివరాల నమోదు సక్రమంగా జరుగుతుందా లేదా అనే అంశాలపై జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లలితకుమారి ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల పరిధిలోని సూపర్‌వైజర్లందరూ సుమారు 50మంది వరకు నారాయణఖేడ్ నియోజకవర్గంలో మూడు రోజులపాటు అన్ని కేంద్రాలను తనిఖీ చేస్తారు. కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులు సూచించిన వివరాలన్నింటిని నమోదు సక్రమంగా చేశారా లేదా పరిశీలిస్తారు. ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్ది సూచనలు, సలహాలు అందజేస్తారు. ఒక్కో ప్రాజెక్టులో మూడు, నాలుగు రోజుల చొప్పున జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల పరిధిలోని వందశాతం అంగన్‌వాడీ కేంద్రాలను నెలాఖరు వరకు తనిఖీలు చేపట్టనున్నారు.

కేంద్రాలు తనిఖీ



ఖేడ్ నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల సూపర్‌వైజర్లు తనిఖీలను ప్రారంభించారు. కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువు పరిశీలిస్తున్నారు. తాము కేంద్రాలకు వెళ్లి పర్యవేక్షిస్తున్నాం.

– సుజాత, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు నారాయణఖేడ్

నెలాఖరు వరకు తనిఖీలు



ఈ నెలాఖరు వరకు జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు క్రాస్ చెక్ చేస్తారు. పిల్లల బరువు, ఎత్తు నమోదు సక్రమంగా చేస్తున్నారా లేదా పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేస్తారు. ప్రత్యక్షంగా బరువు, ఎత్తు కొలిచి పరిశీలిస్తారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నాం.

– లలితకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంగారెడ్డి

చిచ్చురేపిన పచ్చగడ్డి

- వృద్ధుడి ఉసురు తీసిన భూ తగాదా
- వరుసకు కొడుకే నిందితుడు
- వేలూరు వృద్ధుని హత్యకేసు ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): పచ్చగడ్డి వేసిన పొలం చిచ్చురేపింది. భూ తగాదా వృద్ధుని ఉసురు తీసింది. వరుసకు కొడుకే హంతకుడయ్యాడు. పారతో దాడిచేసి హతమార్చాడు. రెండు రోజుల క్రితం (శనివారం) వర్గల్ మండలం వేలూరులో వృద్ధుడు రాయన్న నర్సయ్య హత్యకేసును గౌరారం పోలీసులు ఛేదించారు. సోమవారం నిందితుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. గౌరారం సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఈ కేసుకు సంబంధించి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. వేలూరు గ్రామానికి చెందిన రాయన్న నర్సయ్య(65), వరుసకు కొడుకైన చింతకింది రాజు(39) పొలాలు పక్కపక్కనే ఉంటాయి. వీరిద్దరి మధ్య భూతగాదాలు ఉన్నాయి. గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నర్సయ్య పొలం సమీపంలో రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురయ్యాడు. రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు, గొడవలు, భూవివాదాలు, పాత కక్షలు తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుని విచారణ జరిపారు. హత్యకు పాల్పడిన వరుసకు కొడుకైన చింతకింది రాజును అదుపులోకి తీసుకుని విచారించారు. శనివారం సాయంత్రం వ్యవసాయపొలంలో పనిచేసుకుంటున్న రాజు వద్దకు నర్సయ్య వెళ్లి తన పొలంలో పచ్చగడ్డి ఎందుకు వేశావంటూ తిట్టాడు. కోపంతో రాజు తన చేతిలో ఉన్న పారతో మూడు, నాలుగుసార్లు మెడ, తలపై బాదడంతో నర్సయ్య చనిపోయాడు. ఈ మేరకు నిందితుడు రాజు నేరం అంగీకరించాడని, అతనిని అరెస్ట్‌చేసి సోమవారం రిమాండ్ చేశామని సీఐ పేర్కొన్నారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా తనను చేరదీసి, అప్యాయంగా పెంచిన తాత నర్సయ్య హత్యకు గురవడంతో మనవరాలు శ్వేత అనాథగా మిగిలిపోయింది.

వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు తస్కరణ


బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): బైక్‌పై తీసుకెళ్తానని నమ్మించి వృద్ధురాలి మెడలోంచి పుస్తెల తాడు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన మండల పరిధిలోని తాడూరు క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. తాడూరు గ్రామానికి చెందిన ఈరు సత్తమ్మ, యాదయ్య దంపతులు దైవదర్శనం నిమిత్తం మర్యాక్ వెళ్లి వచ్చే క్రమంలో తాడూరు క్రాస్‌రోడ్డు వద్ద బస్సు దిగారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై భర్త వెళ్లగా అక్కడే ఉన్న సత్తమ్మను అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. కొద్దిదూరం వెళ్లాక బండి ఆపి వృద్ధురాలి మెడలోంచి పుస్తెల తాడు లాక్కుని వెళ్లారు. ఈ క్రమంలో సత్తమ్మ మెడకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపాడు.

క్రీడాభివృద్ధికి రూ.700 కోట్లు


కబడ్డీ ఆడుతున్న మంత్రులు పొన్నం, శ్రీహరి

- దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలి
- హుస్నాబాద్‌కు స్విమ్మింగ్ పూల్ మంజూరు
- మంత్రి వాకిటి శ్రీహరి

హుస్నాబాద్: దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్రానికి ఖ్యాతి తీసుకురావాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీస్‌ల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హుస్నాబాద్ మిని స్టేడియంను సందర్శించారు. స్థానిక క్రీడాకారులు, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ..తమ ప్రభుత్వం మొదటి మంత్రివర్గ సమావేశంలోనే క్రీడా పాలసీని ప్రకటించిందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్ గేమ్స్‌లో దేశం నుంచి ఒక్క బంగారు పతకాన్ని సాధించలేకపోయామని విచారం వ్యక్తం చేశారు. క్రీడల అభివృద్ధికి రూ.700 కోట్లు కేటాయించామని చెప్పారు. హుస్నాబాద్ ప్రాంతంలో విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని కనబరచడం సంతోషకర విషయమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్ష మేరకు హుస్నాబాద్‌లో స్విమ్మింగ్ పూల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సాంకేతిక సమస్యలు అధిగమించి క్రికెట్ స్టేడియంను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని పాఠశాలల్లో అన్ని రకాల స్పోర్ట్స్ కిట్లను అందిస్తామన్నారు.

హుస్నాబాద్ క్రీడలకు పెట్టింది పేరు: పొన్నం

హుస్నాబాద్ నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు, యువకులు ఉపయోగించుకోవాలన్నారు. కబడ్డీ కోర్టుకు రెండు మ్యాట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రతి నియోజకవర్గంలో క్రీడా సౌకర్యాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. అనంతరం మినీ స్టేడియంలో మంత్రులు, కలెక్టర్, ఇతర అధికారులు తల్లుల పేరు మీద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ సోనీ బాలాదేవి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

దుబ్బాకటౌన్: కుటుంబ కలహాలతో జీవితం మీద విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బేగంపేట పోలీసుల కథనం ప్రకారం.. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన మొహమ్మద్ షాదుల్లా (36) టైల్స్, మేస్త్రీ పని చేసుకుంటూ.. జీవనం సాగిస్తుండేవాడు. షాదుల్లాకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై జీవితం మీద విరక్తితో ఆదివారం రాత్రి 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వార జిల్లాకు చెందిన దీపక్ తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం 15రోజుల క్రితం సిద్దిపేటకు వచ్చాడు. స్థానికంగా కేసీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. పట్టణంలోని జయలక్ష్మీ ఇండస్ట్రీస్‌లో కూలి పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి సామాను కొనుగోలు చేయడానికి ద్విచక్ర వాహనంపై మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో రాంగ్ రూట్‌లో వచ్చిన సంజీవ్‌దీపక్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఈ పాపం ఎవరిది..?

- 'సిగాచీ'ప్రమాదానికి కారణాలెన్నో..
- అన్ని శాఖల నిర్లక్ష్యం కూడా..
- నవీన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేదు
- పారిశ్రామికవాడలో కార్మికుల చర్చోపచర్చలు



పటాన్‌చెరు: సిగాచి పరిశ్రమలో అసలు ప్రమాదం ఎలా జరిగింది.. దానికి కారణాలేమిటి..? ఇంకా ఎనిమిది మంది కార్మికుల జాడ సంగతేమిటి..?డ ఇలా పారిశ్రామికవాడలోని కార్మికులు, సంఘాల నేతలు ప్రమాదంపై చర్చోపచర్చలు చేస్తున్నారు. పరిశ్రమలో సరైన జాగ్రత్తలు పాటించని కారణంగా ప్రమాదం జరిగిందని వారు భావిస్తున్నారు. ప్రధానంగా ఆ పరిశ్రమను స్థాపించిన నాటి పరిస్థితులే నేటికీ ఆ పరిశ్రమలో ఉన్నాయని నవీన సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి పరిశ్రమను అభివృద్ధి చేయలేదని చెబుతున్నారు. బాయిలర్‌కు అనుసంధానమైన డ్రైయ్యర్‌కు నిబంధనల ప్రకారం ఉండాల్సిన దూరం లేదని చెబుతున్నారు. ఇంట్లో గ్యాస్ కుక్కర్‌కు ఉండే సేఫ్టీ నట్ లాంటి వ్యవస్థ డ్రైయ్యర్‌కు లేకపోవడం కారణంగానే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. మొత్తం అయిదు చోట్ల ఎగ్జాస్ట్ హోల్స్ (ఆవిరి బయటకు వెళ్లే మార్గాలు) ఉండాలని, అలాంటి వ్యవస్థ లేని కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇది వరకే ఓ కార్మికుడి కుటుంబీకుడు తన తండ్రి చెప్పినట్లు పాత సామగ్రి కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. కనీసం ఫైర్ ఇంజన్ పరిశ్రమ చుట్టూరా తిరిగే విధంగా సెట్ బ్యాక్‌లు కూడా లేవు. అగ్నిమాపక శాఖ, విద్యుత్ అధికారులు, టీఎస్ఐఐసీ అధికారుల నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి కారణం అని చెబుతున్నారు. పరిశ్రమలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రహరీగోడపై అమర్చి ఉండటాన్ని తప్పు పడుతున్నారు. క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఉండే సెక్షన్‌ను డ్రయ్యర్ ఉన్న చోట పై అంతస్తులో ఉండటాన్ని కూడ తప్పు పడుతున్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలో ఉత్పత్తి చేస్తున్న పరిమాణానికి తగిన విధంగా ఏర్పాట్లు లేవని ఎప్పుడో 1989లో స్థాపించిన పద్ధతిలోనే పరిశ్రమ ఇప్పటికీ పెద్ద మార్పులు లేకుండా కొనసాగుతుందని వివరించారు. అన్ని శాఖల వారి నిర్లక్ష్యం కారణంగానే ఆ ప్రమాదం జరిగిందని చెప్తున్నారు. ఇతర యూనియన్ నేతలు మాట్లాడుతూ నిపుణులైన కార్మికులను కాకుండా అన్‌స్కిల్డ్ వర్కర్లను పని చేయించడం కారణంగా కూడా ప్రమాదానికి కారణమని విశ్లేషిస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనేందుకు హైలెవల్ కమిటీ, నిపుణుల కమిటీలు అధ్యయనం ఓ వైపు కొనసాగుతుండగా పారిశ్రామికవాడలో ప్రమాదానికి కారణాలపై చర్చించుకోవడం గమనార్హం.

భద్రత.. పునరావాసం

- కార్మికులకు వరం నమస్తేపథకం
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అమలు
- గుర్తించిన కార్మికుల వివరాలు యాప్‌లో నమోదు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీల పరిధిలో మరుగుదొడ్ల వ్యర్థాలను తొలగించే పాకీ పనివారు, సెప్టిక్ ట్యాంక్‌లు, మురుగు కాల్వలు, మ్యాన్‌హోల్స్‌ను శుభ్రపరిచే కార్మికులు, చెత్త ఏరుకునే వారి శ్రేయస్సు కోసం కేంద్రం 'నమస్తే'అనే పథకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో జాతీయ యాంత్రిక పారిశుద్ధ్య పర్యావరణ వ్యవస్థ (నమస్తే) పథకం కింద గుర్తించిన కార్మికులను యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల్లో ఈ పథకం అమలు చేస్తున్నారు. ఆయా వృత్తుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల భద్రత, పునరావాసం కోసం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పారిశుద్ధ్య కార్మికుల భద్రత గౌరవంతో పాటు సురక్షితమైన వాతావరణంలో పని చేసుకోవడం, వారికి పరికరాలు అందించడం, పునరావాసం కల్పించడం, ఆధునిక, సురక్షిత పద్ధతుల్లో వారికి శిక్షణ ఇవ్వడం, ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ కోవలోకి వచ్చే కార్మికులకు రక్షణ కల్పించేలా ఈ పథకం ద్వారా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందుల పాలవుతున్నట్లు గుర్తించిన కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు గుర్తించిన కార్మికులకు ఆరోగ్య కిట్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధ్యమైనంత మేరకు యంత్రాలను ఉపయోగించి వీరు పనిచేసేలా చూడటంతో పాటు వారి ఆరోగ్యానికి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలు నమస్తే యాప్‌లో నమోదు చేస్తున్నారు.



నమస్తే పథకం యాప్

చెత్త ఏరుకునే వారు సైతం..

సాధారణంగా పట్టణాల్లో చెత్త సేకరణ ద్వారా ఎన్నో కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో జీవితం వెళ్లదీస్తున్నాయి. వీరు డంప్‌యార్డులు, ఇతర ప్రదేశాల్లో చెత్తను సేకరించి దాన్ని అమ్ముకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరు సైతం తమ వివరాలు నమస్తే యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. భవిష్యత్‌లో వీరికి కేంద్రం తరపున పలు పథకాలు, పింఛన్ అమలు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే మెదక్, తూప్రాన్ మున్సిపాలిటీల పరిధిలో 14 మంది చొప్పున మొత్తం 28 మంది కార్మికులను గుర్తించి వారి వివరాలు యాప్‌లో నమోదు చేశారు. నర్సాపూర్‌లో నలుగురిని గుర్తించారు. రామాయంపేటలో మాత్రం ఇంకా నమోదు కార్యక్రమం ప్రారంభం కాలేదు.


తూప్రాన్ మున్సిపాలిటీలో గుర్తించిన కార్మికులను యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు

పథకాలివే..

- నమస్తే యాప్‌లో నమోదు చేసుకున్న ఆయా వృత్తులు చేసుకుంటున్న కార్మికులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ. ఐదు లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కలుగుతుంది.
- పారిశుద్ధ్య సంబంధిత వాహనలపై సబ్సిడీ
- కార్మికుల పిల్లలు చదువుకునేందుకు ఆర్థికసాయం
- కార్మికుల కుటుబాలకు పునరావాసం
- ప్రత్యామ్నాయ జీవనోపాధికి అవకాశం
- వ్యక్తిగత రక్షణ పరికరాల పంపిణీ

కార్మికులకు వరం



కేంద్రం ప్రవేశపెట్టిన నమస్తే పథకం ఆయా వృత్తులు చేసుకుంటున్న కార్మికులకు వరం లాంటిది. సరిగా గుర్తింపులేని కార్మికులకు తగిన గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వ పరంగా వీరిని ఆదుకునే అవకాశం ఉంది. భవిష్యత్‌లో వీరికి పునరావాసం అందే అవకాశం ఉంటుంది.

– వెంకటేశ్, పర్యావరణ ఇంజనీర్, మెదక్ మున్సిపాలిటీ